క్లుప్తంగా

పాఠశాలలో ఎంఈవో తనిఖీలు



ఆశ్రమ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో మల్లేశ్వరరావు

గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఎంఈవో మల్లేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలన్నారు. మెనూ ప్రకారంగా నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఎం వరలక్ష్మి, వార్డెన్ లావణ్య తదితరులున్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే పర్యటన

గంగవరం: మండలంలోని సూరంపాలెం పంచాయతీ రాజుపేటలొద్ది గ్రామంలో బాపనమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో బుధవారం జరగనున్న అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొననున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలో గల వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై మాజీ ఎమ్మెల్యే పర్యటన విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అప్పలరాజు, ఇన్‌చార్జి రఘునాథ్ తెలిపారు.

గుండెపోటుతో అటెండర్ సత్యవతి మృతి



సత్యవతి(ఫైల్)

డుంబ్రిగుడ: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అటెండర్(వోఎస్) సత్యవతి సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు ఆమె మృతికి ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, సిబ్బందితో పాటు ప్రజాప్రతినిధులు ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చటారిజానకమ్మ, వైస్ ఎంపీపీ ఆనంద్, లలిత, సర్పంచ్‌లు, ఎంపీటీసీ తదితరులు సంతాపం తెలిపారు.

60 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



రాజవొమ్మంగి పీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్ సుష్మ

రాజవొమ్మంగి: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ వైద్య శిబిరంలో 61 మంది గర్భిణులను పరీక్షించినట్టు డాక్టర్ సుష్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి తగిన సూచనలు ఇచ్చామన్నారు. హైపర్‌టెన్షన్, స్కానింగ్ పరీక్షలు కూడా చేసి వారి ఆరోగ్య పరిస్థితి అంచనా వేశామన్నారు. హెచ్‌వీ రమాబాయి, లక్ష్మమ్మ, ఏఎన్ఎంలు ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



నర్సీపుట్టులో బోరు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రమేష్ తదితరులు

ముంచంగిపుట్టు: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా కృషి చేస్తున్నానని సర్పంచ్ వి.రమేష్ అన్నారు.మండలంలోని సుజనకోట పంచాయతీ నర్సీపుట్టు గ్రామంలో బోరు నిర్మాణ పనులకు ఆయన మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో ప్రతి గ్రామంలో నీటి సమస్యను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి, ఆదర్శ పంచాయితీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. వార్డు మెంబర్ జయరాం, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగారావు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటల సాగు... లాభాలు బాగు

- విస్తారంగా అల్లం, పసుపు, వెల్లుల్లి సాగు
- మార్కెట్‌లో గిరాకీ
- గిట్టుబాటు ధరలు
- పెరుగుతున్న పంట విస్తీర్ణం
- రైతులకు అధికారుల సూచనలు, సలహాలు



సాగర గ్రామంలో సాగులో ఉన్న స్వీట్‌కార్న్ పంట



మొక్కజొన్న తోట



రైతులకు సూచనలిస్తున్న అధికారులు



మండలంలో సాగులో ఉన్న అల్లం పంట

డుంబ్రిగుడ: మండలంలోని గిరిజన రైతులు వ్యవసాయ పంటలతో పాటు వాణిజ్య పంటలపై మక్కువ చూపుతున్నారు. వివిధ వాణిజ్య పంటలకు వ్యవసాయ అధికారులతో పాటు ఉద్యానవనశాఖ అధికారులు ప్రతి నిత్యం రైతులకు సలహాలు సూచనలిస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నారు. మన్యంలో భూసారం, వాతావరణం అన్ని పంటలకు అనుకూలంగా ఉండడంతో గిరిజన రైతులు అన్ని సీజన్‌లలో పండిస్తున్నారు. మన్యంలో ప్రముఖంగా పండించే వాణిజ్య పంటల్లో కాఫీ, పసుపు, మిరియాలు, అల్లం, వెల్లుల్లి తదితర ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ ఉంది. మంచి గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. దీంతో గిరిజన రైతులు ఏటా ఎక్కువ విస్తీర్ణంలో ఆయా పంటలను పండిస్తున్నారు.

రైతులకు నగదు ప్రోత్సాహకాలు

మండలంలోని అరమ, తూటంగి, లైగండ, సొవ్వా, సాగర, కురిడి, పోతంగి కండ్రుమ్ తదితరు పంచాయతీల్లో అల్లం పంట సుమారు 900 ఎకరాల్లో రైతులు పండిస్తున్నారు. సుమారు 360 హెక్టర్‌లలో అల్లంతో పాటు 130 ఎకరాల్లో మొక్కజొన్నతో పాటు 42 ఎకరాల్లో స్వీట్‌కార్న్ పంటను సాగు చేస్తున్నారు. ఉద్యానవనశాఖ అధికారులు ప్రతి పంచాయతీల్లో పంటలను పరిశీలించి మెరుగైన దిగబడుల కోసం సూచనలు, సలహాలు ఇస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది గసభ, సొవ్వా, అరమ, పోతంగి, కురిడి, కండ్రుమ్, పంచాయతీల్లో రైతులను గుర్తించి ప్రోత్సాహం కింద రైతులకు ఒక హెక్టార్‌కు రూ. 12,000/- అందజేసేందుకు సిద్ధంగా ఉన్నమని ఉద్యానవనశాఖ అధికారులు చెప్పారు. గత ఏడాది అరమ, కొర్రాయి, పోతంగి పంచాయితీల రైతులకు ఈ ప్రోత్సాహం అందజేశారు.

ఆశాజనకంగా ధరలు

ప్రస్తుతం అల్లం రేటు సంతలో మొదటి రకం కిలో రూ.60 నుంచి రూ.80 ఉంది. రెండో రకం కిలో రూ.40 నుంచి రూ.60లు ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అల్లం, వెల్లుల్లి, పసుపు తదితర పంటలు నష్టపోకుండా అధికారులు సూచనలిస్తున్నారంటున్నారు. ప్రస్తుతం అల్లం పంట దిగుబడికి సిద్ధం ఉందని రైతులు చెబుతున్నారు. మార్కెట్‌లో మన్యం అల్లంనకు మంచి డిమాండ్ ఉందని, ఏటా లాభాలు వస్తున్నాయంటున్నారు. మార్కెట్ రేటు కొద్దిగా పెరిగిన తరువాత జనవరి మొదటి వారం నుంచి అల్లం అమ్మకాలు ప్రారంభిస్తామంటున్నారు. అదే విధంగా మన్యంలో పండించే స్వీట్‌కార్న్, నాటు మొక్కజొన్నకు మైదాన ప్రాంతంతో పాటు వారపు సంతల్లో ఎక్కువ డిమాండ్ ఉంది. ఇక్కడ పర్యాటక ప్రదేశాల్లో స్వీట్‌కార్న్, నాటు మొక్కజొన్న అమ్మకాలు బాగా జరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు. వ్యాపారులు రైతుల తోటలకు వెళ్లి ఒక్క పొత్తు రూ.10 చొప్పున కొనుగోలు చేస్తూ పర్యాటక ప్రదేశాల్లో రూ.20ల కంటే ఎక్కువ ధరలు విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారంటున్నారు. తోట ఉన్నవారికి ఎటువంటి దళారుల బేడద లేదంటున్నారు. ప్రస్తుతం గిట్టుబాటు ధరలు ఉన్నాయని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అశకాశముందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల సూచనలతో పంటకు రక్షణ



ఏడాది సుమారు ఒక ఎకరంలో అల్లం సాగు చేపట్టారు. ఉద్యాన వనశాఖ అధికారుల సలహాలతో వచ్చే నెలలో అల్లం పంట తీయాలని, మంచి లాభలు వస్తాయని సూచించారు. పాత అల్లం కాబట్టి వర్షాలతో కుళ్లీ పోతుందని భయపడ్డాను. అయితే ప్రస్తుతం అల్లం పెడలు భాగున్నాయి. పాత అల్లం దిగుబడి పూర్తయిన తరువాత అమ్ముకొని రెండోసారి మరింత ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తాను. – పాంగి లోకేనాథ్, రంగినిగుడ, పోతంగి పంచాయతీ డుంబ్రిగుడ

విత్తనశుద్ధి తప్పనిసరి



సాగుకు ముందుగా తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి. ట్రికోడర్మ విరిదే 5 గ్రాములు ఒక లీటరు నీరులో వేసి ఆరగంట పాటు ఆరనిచ్చి తర్వాత అల్లం పంటను ఆరబెట్టి నాటుకోవాలి. బోదేశాల పద్ధతిలో నాటుకోవాలి. దీంతో దుంపకు కుళ్ల తెగు తెగులు రాకుండా చేస్తుంది.

– కె.శిరీష ఉద్యానవనశాఖ అధికారి, డుంబ్రిగుడ మండలం

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ దురియా పుష్పలత

చింతపల్లి: మండల కేంద్రంలోని మంగళవారం గ్రామసభ నిర్వహించారు. కార్యకమంలో పాల్గొన్న సర్పంచ్ దురియా పుష్పలత మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో పాటు అన్ని ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. చింతపల్లిలో తాగునీటి సమస్య నివారణకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రనునిధులు మంజూరు చేయాలని కోరగా మూడు బోర్లు మంజూరు చేశారన్నారు.వాటి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, ఎంపీటీసీ సభ్యురాలు దారలక్ష్మి పాల్గొన్నారు.

సచివాలయంలో రికార్డుల పరిశీలన



మొండిగెడ్డ సచివాలయంలో తనిఖీలు చేస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: సచివాలయాల్లో ఉద్యోగులు సమయపాలనతో పాటు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. మండలంలోని మొండిగెడ్డలోని గ్రామ సచివాలయాన్నిఈవోపీఆర్డీ పాపారావుతో కలిసి ఆయన మంగళవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. గ్రామంలో దివ్యాంగ చిన్నారుల వివరాలు సేకరించాలని ఆదేశించారు. మండల ఇంజినీరింగ్ అధికారి జ్యోతిబాబు, పంచాయతీ కార్యదర్శి పూర్ణ చంద్రరావు తదితరులున్నారు.

ఆదివాసీ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి



చింతూరు ఐటీడీఏ ఎదుట నిరాహారదీక్ష చేస్తున్న ఆదివాసీ నిరుద్యోగులు

చింతూరు: షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీలకు ఉపాధి కల్పించేందుకు ఉద్యగ భద్రత చట్టంపై తీర్మానం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం చినవీరభద్రం డిమాండ్ చేశారు. ఆదివాసీలకు ఉద్యోగభద్రత కల్పించాలని కోరుతూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ ఎదుట ఆదివాసీ నిరుద్యోగులు చేపట్టిన 72 గంటల రిలే నిరాహార దీక్షలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలను స్థానిక ఆదివాసీ యువతతోనే భర్తీ చేయాలన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులను పటిష్టంగా అమలు చేయాలని ఆయన కోరారు. డిప్యుటేషన్ పేరుతో స్థానికంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు పంపడం వలన ఇక్కడి ఆదివాసీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. నాయకులు వీరయ్య, ప్రసాద్, శ్రీను, లక్ష్మణరావు, లక్ష్మయ్య, కోటి, రాజు, శేషు, మహేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్

చింతపల్లి: మండల కేంద్రంలోని మార్కెట్‌వీధిలో డ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్ ప్రారంభించారు. పంచాయతీ కేంద్రంలో పూర్తిస్థాయి డ్రైనేజీ సౌకర్యం కల్పించే విధంగా నిదులు మంజూరు చేస్తూ పనులు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా మార్కెట్ వీధిలోడ్రైనేజీ నిర్మాణానికి రూ.6.5 లక్షలు జిల్లా పరిషత్ నిధులు కేటాయించినట్టు తెలిపారు. మండల కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మీ

గంగవరం: మండల కేంద్రంలోని సీడీపీవో కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికల వికాసంపై మహిళా సంరక్షణ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో సీహెచ్.లక్ష్మీ మాట్లాడుతూ బాలికా, మహిళల చట్టాలు, హక్కులపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను గిరిజనులకు వివరించాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్ఐ భూషణం మాట్లాడుతూ మహిళలు, బాలికల హక్కులు, పోక్సో, దిశ తదితర చట్టాలను వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి భావన, వెలుగు ఏపీఎం షణ్ముఖరావు, ఎంఈవో మల్లేశ్వరరావు, సూపర్‌వైజర్లు సత్యవతి, జయలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా నేటికీ ఒక్క పథకం అమలుచేయలేదని, సూపర్ సిక్స్ హామీలను విస్మరించిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను, హామీలు అమలుచేయకుండా ప్రజలను మోసగించడంపై పార్టీ ఆధిష్టానం పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ నేతలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో ఈనెల 12న ఉదయం 10 అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నామని అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

ఆదివాసీల గృహ నిర్మాణానికి నిధులు పెంచాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షుడు చినబాబు

అరకులోయటౌన్: బస్కీ పంచాయతీ కంజరితోట, బిజగుడ, కొంత్రాయిగుడ గ్రామాల్లో గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షుడు గెమ్మెలి చినబాబు మంగళవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీల గృహాల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జన్‌మన్ పథకం ద్వారా యూనిట్‌కు రూ.5లక్షల నిధులు కేటాయించాలన్నారు. గృహ నిర్మాణాలకు ఇసుక, సిమెంట్ తదితర సామగ్రి తరలించేందుకు ప్రస్తుతం మంజూరు చేస్తున్న నిధులు సరిపడవని ఈ మేరకు నిధులు మరింత పెంచాలని డిమాండ్ చేశారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి



పట్టాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సీతయ్య, వీఆర్‌వో కృపాకర్

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని కొత్తూరు పంచాయతీ కృష్ణాపురంలో మంగళవారం వీఆర్‌వో కృపాకర్, సర్పంచ్ సీతయ్య ఆధ్వర్యంలో గిరిజనులకు కొండపోడు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సీతయ్య మాట్లాడుతూ పట్టాలు పొందిన గిరిజనులు ఈ–క్రాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

బొర్రా గుహల అందాలు అద్భుతం



బొర్రా గుహల ముఖ ద్వారం వద్ద ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులు, బృందం

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బొర్రా గుహలను ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు తదితరులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొర్రా గుహల అందాలు అద్భుతమన్నారు. ఈ ప్రాంతం పర్యాటకానికి మణిహారమన్నారు. కార్యక్రమంలో ట్రైకార్ డైరెక్టర్లు సింహాచలం, పువ్వాల లావణ్య, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలపై అవగాహన తప్పనిసరి



అరకులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్



రంపచోడవరంలో మాట్లాడుతున్న న్యాయవాది వెంకటేశ్వర్లు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలల్లో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలల ప్రిన్సిపాల్లు డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, పట్నాసి చలపతి రావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులంతా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అధ్యాపకులు వై. విజయలక్ష్మి, అనిత కుమారి, స్వర్ణలత, బాలరాజు, మురళీకృష్ణ, వైకుంఠరావు, విజయ పాల్గొన్నారు.

రంపచోడవరం: మానవ హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు బాధితుడు చట్టపరంగా న్యాయం పొందవచ్చని రంపచోడవరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ అన్నారు. డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘ జరిగితే కమిషన్‌కు ఫిర్యాదు చేసి న్యాయం పొందచ్చన్నారు. న్యాయవాది వెంకటేశ్వర్లు చట్టాల గురించి అవగాహన కల్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

13 నుంచి రెవెన్యూ సదస్సులు

ముంచంగిపుట్టు: భూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 13 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ నర్సమ్మ తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో 23 పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, సమస్యలపై వినతులు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు రెండు టీమ్‌లను నియమించినట్టు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సు జరగుతుందన్నారు. ఆర్ఐలు, వీఆర్‌వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని ఈనెల 13 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు మండల ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో రైతుల భూములపై సమగ్ర సర్వేలు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 13న సాగర పంచాయతీ వసబంద, గసభ పంచాయతీ లోగిలిలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, జనవరి 10న అరకులో సదస్సును ముగుస్తోందని చెప్పారు.

అంతర్లలో ఆయుర్వేద వైద్య శిబిరం



అంతర్లలోని వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

చింతపల్లి: మండలంలో అంతర్ల గ్రామంలో మంగళవారం ప్రాంతీయ ఆరోగ్య పరిశోధన సంస్థ విజయవాడ, కేంద్రీయ ఆయుర్వేద విజ్ఞాన పరిశోధన పరిషత్, ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి అధిక సంఖ్యలో వచ్చిన గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రోగ్రాం ఇన్‌చార్జి డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి నెల ఏడు గ్రామాల్లో ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెలలో లంబసింగి, కొలపరి, వంగసార, అన్నవరం, మేడూరు, బైలుకించంగి తదతర గ్రామాల్లో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. డాక్టర్ కె.నిషాంత్, డాక్టర్ సుజాత సంస్థ సభ్యుల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై వినతి



జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పాడేరు రూరల్(అరకులోయ రూరల్): స్కాలర్‌షిప్‌ల మంజూరు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా సంఘం అధ్యక్షుడు వి.కృష్ణారావు, ఉపాధ్యక్షుడు తనీష్ తదితరులు మంగళవారం సబ్ కలెక్టర్ అభిషేక్ గౌడకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజలు భారంతో చదవుకు దూరమై కూలీ పనులకు వెళ్తున్నారన్నారు. గిరిజన వసతి గృహాల్లో హెల్త్ వలంటీర్లను నియమించాలని, అన్ని రకాల మౌలిక సదుపాయాలు సౌకర్యాలు కల్పించాలని వినతిలో కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. నాయకులు వరుణ్, అప్పలమ్మ, రషిత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు



అరమలో రైతులతో ఏవో నీలవేణి



గుమ్మకోటలో రైతులతో ఏవో ఉమామహేశ్వరి

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని గుమ్మకోట పంచాయతీ ఆర్‌బీకేలో సర్పంచ్ అప్పారావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఉమామహేశ్వరి రైతులకు పలు సూచనలిచ్చారు. ఆమె పంటలను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు జీవామృతం వినియోగించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఆర్ఐ కోటిబాబు, ఎంపీటీసీ తవిటి నాయుడు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయితీలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారి నీలవేణి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వరి కోతల్లో తీసుకోవలసిన తగు జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఉద్యానవనశాఖ విలేజ్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్ రత్నం పాల్గొన్నారు.